

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 18 మార్చి, 2022 సంచిక : 10

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. .......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం ........... రూ॥ 1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
ఉత్సాహం ఉరకలు వేయాలి ........ 5
సమతే ముక్తి ........ 7
స్వార్థమే అనర్థకారణం ........ 10
పారమార్థిక నిధులు ........ 14
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 16
సాయిభక్త దాసగణు ........ 19
శాశ్వత ధర్మగోప్త ........ 22
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 25
DECLARATION ........ 27
సంకల్పమే శక్తి ........ 28

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



ఆశ్రమం అనగానే మనకు గుర్తు వచ్చేవి పర్ణకుటీరాలు, పుష్ప, ఫల వృక్షాలు, ప్రశాంతత, తపస్సు, ధ్యానం ..... యిలా. మన ధర్మశాస్త్రాలు చెప్పిన ప్రకారం హిందువుకు (నాలుగు) చతురాశ్రమాలుంటాయి. తొలి పాతికేళ్లు బ్రహ్మచర్యంలో జ్ఞానార్జన, గురుసేవ కర్తవ్యాలు. రెండవదైన గృహస్థా శ్రమంలో మాతాపితృసేవ, అతిథి సంతర్పణ, గృహదేవతా పూజనం, దేవాలయ ఆరామ తటాకాది ప్రతిష్ఠలు, సాధు సన్యాసపోషణ, బాలబ్రహ్మ చారులకు సేవ (పూర్వం విద్యార్థులు భిక్షాటనతో జీవించటం సంప్ర దాయం) -వీటితోపాటు తన సంసారపోషణ-యివన్నీ విధులు. ప్రస్తుతం దీని అర్థం తారుమారైపోయింది. భార్యాబిడ్డల పోషణ, బాగా ధనార్జన చేసి కూడబెట్టడం-యివి ముఖ్యమైపోయాయి. (అసలిలా అనటం కన్నా యివే ముఖ్యమైపోయాయి-అనటం న్యాయం). మిగిలిన కర్తవ్యాలు దాదాపుగా గృహస్థులంతా మర్చిపోతున్నారు. కన్నవారికీ, ఉన్న భూమికీ, ధర్మరక్షణకూ ఏమీ చెయ్యకుండా "నా కొడుకును అది చదివించాను, నా కూతురికి ఇంత కట్నం యిచ్చాను-ఇంత పెద్ద ఆస్తి సంపాదించాను" అని గర్వపడే గృహస్థు ధర్మచ్యుతుడనే అనుకోవాలి.

సరే-గృహస్థాశ్రమం తరువాత విధింపబడినది వానప్రస్థాశ్రమం. వానప్రస్థుడు తాను బ్రహ్మచర్యంలో నేర్చిన జ్ఞానాన్ని మరోసారి గురుముఖతః వింటూ, నెమరువేసుకుంటాడు. గృహస్థజీవనంలో కర్తవ్యాలమాటున, వ్యామోహాల అడుగునపడి నలిగి అణిగిపోయిన సాధనక్రమాన్ని పునరుద్ధ రించుకోవడానికి ఇది నిర్దేశింపబడింది. వనవాసం-లేదా ఆశ్రమవాసం-వీలైతే భార్యాసహితుడై, ఆమె సానుకూలంగా లేకపోతే ఒంటరిగా స్వీక రించాలి. తానొకవైపు సాధన (వ్యక్తిగతంగా-ధ్యానం, జపం మొదలైనవి) చేసుకొంటూనే లోకకళ్యాణ కారకాలైన కార్యాలు చేపట్టి సమాజానికి

తోడ్పడుతుండాలి. ఆశ్రమ ప్రయోజనాలకు కూడా వానప్రస్థుడు గొప్ప సహకారి కాగలడు. కొంతమంది నేర్చుకోవటం మీదనే ఉత్సాహం చూపిస్తారుగానీ నేర్చినది ఆచరించటంలో చూపించరు. అసలు నేర్చుకోవటం అంటేనే ఆచరించటం అంటారు గురుదేవులు.

వ్యక్తి (గృహస్థు) వానప్రస్థుడిగా మారిన తరువాత-అతనికి తన వెనకటి జీవితంతో, బంధు బలగంతో, ఆస్తిపాస్తులతో సంబంధం అతి తక్కువగా ఉండాలి. పూర్తిగా విడవగలిగినా మంచిదే. దురదృష్టవశాత్తు ఇప్పడు వనాలు లేవు, ఋషివాటికలూ లేవు. వానప్రస్థాశ్రమం అనే పేరిట కొన్ని ఆశ్రమాలు నడుస్తున్నాయి. కానీ వృద్ధాశ్రమానికీ, వానప్రస్థాశ్రమానికీ ఉండవలసిన భేదాన్ని గమనించటం బొత్తిగా కన్పించటం లేదు. తాను చెయ్యవలసిన, చెయ్యగలిగిన పనులేమీ లేనపుడు-ఇక మిగిలిన ఆ కాస్త కాలాన్నీ ఏదో ఒకరకంగా కృష్ణారామా అనుకొంటూ, కడపటి క్షణాల కోసం ఎదురుచూస్తూ గడిపేది వృద్ధాశ్రమం. ఆ కాస్త కాలాన్నీ కూడా సద్వినియోగ పరచుకోవడానికి తపిస్తూ "తొందర తొందరగా ఎంత చెయ్యగలమో అంతా చెయ్యాలి" అనుకొంటూ, తాను లబ్ధి పొందుతూనే చెయ్యి చాపి ఇతరులక్కూడా ఊత అందించేది వానప్రస్థం. కాకికి ఏదైనా దొరికితే అది వెంటనే తిని వెయ్యదు. కావు కావుమని అరిచి, అరిచి, కాకి గోల చేసి పది కాకులనూ పిలిచి, వాటితో కలిసి తింటుంది. అలాగే వానప్రస్థుడు తాను పొందిన సాధనానందాన్ని నలుగురితో పంచుకుంటాడు. తన శరీర శక్తిని ఇతరుల మేలు కోసం ఉపయోగిస్తుంటాడు. కానీ, ఆశ్రమవాసులైన వారందరూ వానప్రస్థ ప్రయోజనాన్ని గ్రహించరు.

వానప్రస్థాశ్రమం అంటే ఇది ఒక 'ఫామ్‌హౌస్'-అంటే బాగా కలిమి కలిగినవారు ఎప్పడైనా విశ్రాంతిగా, ఏ అలజడీ లేకుండా ఉండటానికి కట్టించుకునే తోట భవనం కాదు. ఏదో కొన్నాళ్లు-నిత్య జీవనరీతితో విసిగి పోయినపుడో, అలసిపోయినపుడో పదిరో జులు నిశ్చింతగా, ప్రశాంతంగా గడిపి మళ్లీ వెనక్కు వెళ్లి తమ గొడవలో తాము పడిపోదలచిన గృహస్థు లకు ఫామ్‌హౌస్‌లూ, రిసార్టులూను. వానప్రస్థుడు తన గతంతో అతి తక్కువ బంధం మిగుల్చుకోవాలి. పెళ్లిళ్లు, షష్టిపూర్తులు, పుట్టినరోజులు,





రిసెప్షన్లు-ఏ బంధువుల యింట్లో ఏది జరిగినా పరుగున వెళ్లి వాలిపోవాలనుకొనేవాడు వానప్రస్థుడు కాలేడు-కాడు. తాను వానప్రస్థుడననే విషయం తన మనసులో నిరంతరం మెదలాలి - ఇతరుల క్కూడా అది తలకెక్కేలా ఉండాలి ఆశ్రమవాసి.

కొంతమంది వానప్రస్థులు సేవ చెయ్యాలనుకుంటారు, చేస్తున్నామని కూడా అనుకుంటారు. కానీ అందులో కూడా తమ గత జీవితపు ఛాయలు - అంటే తమ పొజిషన్, అంతస్థు, ఐశ్వర్యం, బలగం కులం వగైరా వగైరాలు వదిలించుకోలేరు. ఒళ్లు అలవకుండా, కదలకుండా చేసే పైపై పనులకే పరిమితం అవుతారు. ఇంకొందరు 'అబ్బ! చేసీ చేసీ అలిసిపోయాం-రిటైరయ్యాక యింకా యిప్పడు ఏం చెయ్యగలం!" అంటారు. ఎవరికి చేసారిన్నాళ్లూ? తమ కోసం-తమ సంతతి కోసం-తన వాళ్ల కోసం. ఆ పని ప్రతి జీవీ చేస్తుంది. దానికి మనుష్యులమే కానక్కర లేదు. అంతకన్నా శ్రేష్ఠంగా జీవించడానికే మనకీ జన్మ. అయినా రిటైర్మెంట్ దేని నుంచి! ఉద్యోగం నుంచి. రుచి మీది కోరిక, వస్త్రాల మీది అభిమానం, ధనం మీది ప్రీతి, బాంధవ్యాల మీది వ్యామోహం-ఇవేవీ వదల్లేదు గదా! ఒక్క ప్రజోపకారాన్ని మాత్రమే వదులుతారా? అలాటివారు వానప్రస్థులు కారు-కాలేరు. ఏడాదికో పదిరోజులు ఫామ్‌హౌస్‌కు వచ్చి పోతున్నట్లు-నెలల తరబడి, వారాల తరబడి గృహస్థుల సంయోగంలోనే గడుపుతూ-మధ్య మధ్య ఆశ్రమానికి వచ్చిపోతూ మనిషి వృద్ధుడవుతాడేగానీ వానప్రస్థుడు కాలేడు. పైగా తన యీ చర్యల వల్ల మిగిలిన వారిలోనూ, నిర్వాహకుల లోనూ ఉన్న దీక్షను దెబ్బతీసిన వారు కూడా అవుతారు. అందుచేత మనందరం ఒక్క విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

ఆశ్రమం మనం విశ్రాంతిగా ఉండటానికో, 'ఇంటికన్నా గుడి పదిలం' అని మనకు ఇబ్బందిలేకుండా జీవించటానికో కాదు. మనం ఆశ్రమంలోను, సంసారం మనలోనూ ఉండి లాభం లేదు. ఆశ్రమం మనలో ఉండాలి. ఆశ్రమానికి, అక్కడి తీరుతెన్నులకు, నియమాలకు మనను మనం మలుచుకోగలగాలి. అలా అయితేనే అది వానప్రస్థం. గ్రహిద్దాం.

# ఉత్సాహం ఉరకలు వేయాలి!

– నల్లాన్ చక్రవర్తుల విష్ణుప్రియా అయ్యంగార్, విజయవాడ.

అన్ని జన్మలలోను మానవ జన్మ అత్యంత శ్రేష్ఠమైనది. జ్ఞానం కలిగిన వారు మనిషి. జ్ఞానికి ప్రప్రథమంగా ఉండవలసిన లక్షణం 'ఉత్సాహం'. ఆ లక్షణమే వ్యక్తికి బలాన్నిస్తుంది. ఉత్సాహాన్ని కలిగినవాడే అన్నిరకాల సంపదలను కాని, ఇహపరలోక ఐశ్వర్యాలనుగాని పొందుతాడు. ఉత్సాహంతో ఏ పని చేసినా సఫలీకృతమౌతుందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

'యత్నే కృతే యది న సిద్ధ్యతికోఽత్ర దోషః?' మనం సరైన మార్గంలో ప్రయత్నిస్తే దేనికోసమైనా అది సఫలమైతే సంతోషం కలుగుతుంది. ఒకవేళ ప్రయోజనం లేకుంటే అది మన దోషం కాదు.

అందుకే ఉత్సాహంతో సదా ప్రతి పనిని సాధించడానికి ప్రయత్నిస్తుండాలి. శ్రీమద్రామాయణంలో శ్రీరాముడంతటివాడు రావణాసురుడు సీతమ్మను అపహరించుకొని వెళ్ళిన తరువాత సీతమ్మ వియోగాన్ని భరించలేక దుఃఖిస్తాడు. ఆ సమయంలో అన్నగారిని చూసిన లక్ష్మణుడు-

'ఉత్సాహవంతులు ఎప్పటికీ దీనస్థితిని పొందరు. క్రుంగిపోరు. ఉత్సాహవంతుడే నిజమైన బలశాలి. ఉత్సాహాన్ని మించిన బలంలేదు. కాబట్టి మనమూ ఉత్సాహపూరిత శక్తితో సీతమ్మను వెతుకుదాం' అంటూ శ్రీరాముడి అంతటివాడిని ఓదార్చి ఉత్సాహపరుస్తారు.

లక్ష్మణుడు శ్రీరాముడిని ఉత్సాహపరిచిన విధానం మనమూ అనుసరించదగినది.

ఉత్సాహో బలనానార్య! నాస్త్యుత్సాహాత్ పరం బలమ్ ।
సోత్సాహస్యాస్తి లోకేఽస్మిన్ న కించి దపి దుర్లభమ్ ॥





ఉత్సాహవంతః పురుషాః నావసీదంతి కర్మసు ।
ఉత్సాహమాత్ర మాశ్రిత్య సీతాం ప్రతిలభే మహి ॥ అంటాడు. నిరుత్సాహాన్ని మన దరిదాపులకు కూడా రానీయకూడదు.

ఎంతటి వాళ్ళనైనా నిరుత్సాహం క్రుంగదీస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

'వానరయూథముఖ్యుడు', 'శ్రీరామదూత', మనోజవం కలవాడు. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు అని ప్రసిద్ధిని పొందిన హనుమంతుడే నిరుత్సాహాన్ని పొంది, మళ్ళీ తనకు తానుగానే విచారించి ఉత్సాహాన్ని కూడగట్టుకొని విశేషమైన కార్యాన్ని సాధించాడు కదా!

సీతాన్వేషణ కోసం బయలుదేరిన హనుమంతుడు లంకలో సీతమ్మను వెతుకుతాడు. అమ్మ కనిపించదు. అయ్యో! సీతమ్మ జాడను తెలుసుకోలేకపోయానే అని చాలా దుఃఖిస్తాడు. ప్రాణాన్ని కూడా వదలిపెడదామనుకుంటాడు. కానీ మళ్ళీ ధైర్యాన్ని కూడగట్టుకొని స్వయంగా ఉత్సాహాన్ని తెచ్చుకుంటాడు. (అక్కడ హనుమంతుడిని ఉత్సాహపరిచే వారెవ్వరూ లేరు కదా!). మళ్ళీ సీతమ్మను అన్వేషిస్తాననుకుంటాడు. అమ్మ కనబడే వరకు పట్టు వదలక ఉత్సాహంతో సీతమ్మను వెతుకుతాడు. ఆ సందర్భంలో హనుమంతుడు -

అనిర్వేదః శ్రియోమూలం అనిర్వేదో పరం సుఖమ్ ।
అనిర్వేద హి సతతం సర్వార్థేషు ప్రవర్తకః ॥
కరోతి సఫలం జంతోః కర్మయత్తత్ కరోతి సః ।
తస్మాత్ అనిర్వేద కృతం యత్నం చేష్టేహ ముత్తమమ్ ॥

(సుం.12-శ్లో. 11, 12)

పలికిన పలుకులు సత్యాలు. మనందరికీ కర్తవ్య ఉపదేశాలు. లక్ష్యాన్ని సాధించాలంటే నిరుత్సాహం పనికిరాదు.

కార్యసిద్ధిని పొందాలన్నా, మనోధైర్యం కలగాలన్నా, నిరుత్సాహాన్ని, నిరాశ,

నిస్పృహలను దరిచేరనీయకూడదు. దానివల్ల ప్రయోజనం ఎంతమాత్రం ఉండదు. కాబట్టి ఎవరైనా ఏదైనా ఎప్పుడైనా, ఎక్కడైనా పనిని ప్రారంభిస్తే ఆ పనిని సాధించేవరకు పట్టుదలతో శ్రమించాలి. కార్యాన్ని సాధించాలి.

పరిస్థితుల ప్రభావం వల్ల అప్పుడప్పుడు ఆటంకాలు కలిగి నిరుత్సాహం కలిగితే వెంటనే గ్రహించి బుద్ధిమంతుడు అయినవాడు దాన్ని పారద్రోలాలి. అప్పుడే శ్రేయస్సు కలుగుతుంది. కుటుంబం బాగుంటుంది. కుటుంబం బాగుంటే గ్రామం, గ్రామం బాగుంటే నగరం, నగరం బాగుంటే దేశం బాగుంటుంది. ప్రగతిని సాధించగలుగుతాం.

# సమతే ముక్తి

**– వి.యస్.ఆర్.మూర్తి**

మానవుడంటే అంగాంగీ భావంతో ఉండే జీవి మాత్రమే కాదు. ఆత్మ అంటే చైతన్యమే. కనుక మానవుడి నిజతత్వం చైతన్యమయం. అనిత్యమైన శరీరంలో నిత్యమైన చైతన్యం నిలకడగా ఉన్నదన్న సత్యం గ్రహించటానికి శుద్ధజ్ఞానం కావాలి. శుద్ధజ్ఞానం ఎవరెవరి మనోస్థితిని అనుసరించి వారి అనుభవంలోకి వస్తుంది. మనసుకు లోబడటం అజ్ఞానం. మనసును లోబరచుకోవటమే జ్ఞానం. అణగిన మనస్సు, మానవుణ్ణి అంతరంగంవైపు నడిపిస్తుంది. చివరకు అహం స్ఫురణగా మారి ఆత్మానుభవం కలిగిస్తుంది. చిక్కంతా మనసుతోనే.

మనసు ఒక సాలీడు. తాను అల్లిన గూటిని తానే మింగి ఆవృత్తం పూర్తి చేసుకుంటుంది. ప్రపంచాన్ని కల్పించిన మనస్సు, తిరిగి తనలోనే దానిని లీనం చేసుకుంటుంది. చేసుకోవాలి. అది నిజమైన సాధన.

భౌతికంగా కనిపిస్తున్నదంతా అంతరించేదే. అనిపిస్తున్నదంతా అంత





రించేదే. తెర మీద బొమ్మ, తెరను అంటకుండా కనిపిస్తున్నట్లు, మనోయవనికపైన ఆడే బొమ్మే ఈ ప్రపంచం. బొమ్మ కనపడటానికి, కనపడకుండా ఉండటానికి, బయట వస్తువులే కారణం. ఆ వస్తువులు తమ పని ఆపగానే బొమ్మ కనపడటమూ ఆగిపోతుంది. కాలగమనంలో తెర కూడా శిథిలమౌతుంది. కనుక ఇందులో ఏ ఒక్కటీ శాశ్వత వస్తువు కాదు. దేహమూ అంతే!

దేహాలు మారటం ఒక అనివార్యమైన ప్రక్రియ. దేహంలో ఉన్న చైతన్యం మారకపోవటం ఒక సహజస్థితి.

ప్రపంచం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. అది అంతే! చూసే దృష్టిని బట్టి అది అనుభవమౌతుంది. అందుకే మహర్షితత్వంలో మంచి, చెడు అనేవి లేవు. మనోభూమికకు పరిమితమైనంతవరకు, మంచి చెడు అనే విభజన తప్పనిసరి.

అహంకారమే చెడు, తన ఉనికిని తప్ప మరొక దేనినీ అంగీకరించని స్థితి అహంకారం. ఇతరుల లోపాలను ఎన్నటమే చెడు.

ఈ పనిచేస్తున్నది మన పని మనకు స్పృహ కలిగినపుడు, మనసును నియంత్రించగలిగితే, అహంకారం సన్నగిలి అహం స్ఫురణ కలుగుతుంది. మంచి మొలకెత్తి ఆత్మాన్వేషణపై ఆసక్తి ప్రారంభమౌతుంది.

దేనినైనా పోగొట్టుకోగలిగితేనే, కావలసిన దానిని రాబట్టుకోగలం. ఇవ్వటం నేర్చుకోవాలి. ప్రేమ, ఇష్టం, అయిష్టం, ద్వేషం, రాగం, మోహం, వ్యామోహం, వ్యసనం ఎరుగని మనస్వికి ఉన్నదంతా మంచే, కనపడేదంతా మంచే, ఆనందం తప్ప అన్యం లేదు. దీనికి స్వీయ సంస్కరణ ప్రధానం.

ఆదర్శము, విస్తృతమైన సరళ భావజాలము, ఆనందం తాలూకు నీడలే. సుఖము సంతోషం కాదు. అది ఆనందమూ కాదు. అవన్నీ స్థితులే. ఆనందం, ఆంతరంగికం. అది ఒక రసైక స్థితి. మనో నియంత్రణ ద్వారా పొందవలసిన ఒక మహనీయ అనుభవమే ఆనందం.

త్యాగం, సమతకు దారితీయాలి. భిన్నత్వాన్ని రూపుమాపాలి. తద్వారా శాంతి లభిస్తుంది. ఆనందం మోసులెత్తి మానవుడు ప్రేమమయుడౌతాడు.

నిజానికి మనం జీవించవలసినదంతా ఆధ్యాత్మ జీవితమే. అందులో ప్రాపంచిక జీవితం అతి స్వల్పం కావాలి. కానీ జరుగుతున్నది దానికి భిన్నం.

మన అంతరంగంలో మనం భావించే సమతాభావం వలన స్పర్థలు నశించి, వికాసం కలిగి, అన్నింటిని ప్రేమించగలిగే స్థితి ఏర్పడుతుంది. ఆత్మ దర్శనం సహజంగా లభిస్తుంది.

నామరూపాతీతమైన ఆత్మే అన్నీ అనే భావనలో మహర్షి వంటి వారు సర్వత్రా ఆత్మనే దర్శిస్తుంటారు.

మహాపండితుడైన గణపతి మునిని, సాధారణ స్త్రీ మూర్తి అయిన సూరినాగమ్మని, పాల్‌బ్రంటన్, చాడ్విక్, కోహెన్ వంటి మేధావులను, పరమ హంస యోగానంద, శివానంద, నారాయణ గురువంటి మహోన్నత వ్యక్తులను, సమస్త జంతు జాలాన్ని, చివరకు తమ దేహంపై మొలిచిన రాచపుండుని, ఆత్మగానే మహర్షి భావించారు. ఎక్కడా భిన్నత్వం లేదు. వారనుభవించిన ఎరుకే, చివరి వరకు వారిని ఎరుకగా నిలిపింది.

ఆత్మ దర్శనమే అసలు ముక్తి. జీవన్ముక్తుడే మహర్షి. ముక్త జీవనమే అసలు జీవితం. భగవాన్ రమణులు లోకపరిధిలో సంచరించిన పరబ్రహ్మ మూర్తి. ఋణమెరుగని అరుణుడు, చలించటమే తెలియని అచలుడు, అరుణాచల శ్రీరమణుడు.





# స్వార్థమే అనర్థకారణం!

- అమిరపు నటరాజన్

జంతువులకు మంచీచెడూ ఉండవు, మనుషులకే మంచీచెడూ ఉంటాయి. మనిషి ఆదిమానవుడిగా ఉన్నప్పుడు బహుశా జంతువులాగానే బ్రతికి ఉండవచ్చు, కానీ ఆ జంతువుకు ఎప్పుడైతే కొద్దిగా ఆలోచించగలిగే శక్తి పుట్టిందో, అప్పుడే మనిషి పుట్టాడు. ఆలోచన అంటే ఏమిటి? బాహ్యంగా ఉండే విషయాల వల్ల మనిషిలో కలిగే ప్రతిస్పందననే ఆలోచన అంటారు. ఆలోచన అనేది నామరూపాలను ఆధారంగా చేసుకుని పనిచేస్తుంది. నామం, రూపం లేకపోతే ఆలోచన ఉండదు.

**ఏది పరమధర్మం? :** ఆలోచన అనేది మనిషిని జంతువుల నుండి ఎలా వేరుచేసిందన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఊహకందనంత బలంతో తనను అణగద్రొక్కడానికి ప్రకృతి ప్రయత్నిస్తూ ఉన్నప్పుడు, తనచుట్టూ ఉన్న క్రూర జంతువులు కూడా తనను మట్టుబెట్టాలని చూస్తున్నప్పుడు మనిషి వాటినే ప్రార్థించడం ప్రారంభించాడు. అయితే తనకు కలుగుతున్న మంచీచెడూ అనుభవాల పరంపరలో చాలాసార్లు తన వల్లనే తనకు కష్టాలు వస్తున్నాయనీ, తన ప్రతిస్పందన మార్చుకున్నప్పుడు తన కష్టసుఖాలు మారుతున్నాయనీ మనిషి గ్రహించాడు.

ఆ విధంగా చూసినప్పుడు, మనిషికి కలిగిన ఆలోచనలలో ఏ ఆలోచన అన్నిటికన్నా ముఖ్యమైనది. తన సుఖదుఃఖాల కారణం తనలోనే ఉందన్నదే బహుశా అన్నిటికన్నా గొప్ప ఆలోచన అయివుండవచ్చు. అదే ఆత్మ అనీ లేదా భగవంతుడు అనీ మనిషి తెలుసుకున్నాడు. తన తోటివారందరిలోనూ అదే ఆత్మ ఉందనీ, తనకు బాధ కలిగించేదే వారికి కూడా బాధ కలిగిస్తుందనీ తెలుసుకున్నాడు. ఆ భావంలో నుంచే మహాభారతంలో

చెప్పిన "ఒరులేయవి ఒనరించిన నరవర అప్రియము తన మనంబున కగు తానవి ఒరులకు సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్" అనే ఆలోచన పుట్టింది. తనకు దేనివల్ల బాధ కలుగుతుందో అటు వంటి పనిని ఎదుటివారికి తాను చేయకూడదన్నదే ధర్మాలన్నింటిలోకీ పరమధర్మమని చెప్పబడింది. బహుశా మానవుడు సృష్టించిన అత్యంత గొప్ప భావాలలో అదే ముఖ్యమైనదేమోనని అనిపిస్తుంది.

**నాగరకత అంటే ... :** నాగరికత అనే మాట నగరం అనే మాట నుంచి పుట్టింది. అడవిలో ఉండే మనకు సంఘజీవనంలోకి వచ్చి తన నడవడిక మార్చుకున్నాడు. జంతువులలో సంఘజీవనం కంటే మనుషులలో సంఘ జీవనం చాలా సంక్లిష్టమైనదే కాక చాలా విజయవంతమైనదని కూడా చెప్పకోవాలి. అయితే ప్రజాకవి గురజాడ అప్పారావుగారు అన్నట్లు సంఘ జీవనానికి మొదటి నియమం 'సొంతలాభం కొంత మానుకు పొరుగు వారికి తోడుపడవోయ్' అన్నదే!

అయితే నిజమైన, ఆదర్శవంతమైన నాగరకత ఎలా ఉంటుంది? తోటి వారికి తన వల్ల ఏమాత్రం బాధ కలగకుండా ప్రవర్తించడమే నాగరకతకు పరాకాష్ఠ. "నేను ముఖ్యం! అన్నీ నాకే కావాలి!" అనే ధోరణి ఉన్నచోట నారగకత మటుమాయమైపోతుంది. ఆ రకమైన ధోరణి ఉన్న సంఘం నానారకాల యుద్ధాలకూ, కలతలకూ తెగబడటమే కాక అది త్వరలోనే కుప్పకూలటం ఖాయం.

**నాగరకతకు పునాది ... :** ఒక వ్యక్తి ప్రవర్తనను నిజంగా బేరీజు వెయ్యా లంటే అతడు చేసే అతి చిన్న పనులను గమనించమని స్వామి వివేకా నంద చెబుతారు. జపాన్ దేశం లాంటి ఉన్నతమైన సమాజాన్ని చూసి నప్పడు అతి చిన్న విషయాలలో కూడా వారు ఎంతో జాగ్రత్తగా మసలు కోవడం మనకు కనిపిస్తుంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ఫిజిక్సూ, మేథమేటిక్సు కన్నా వారికి సంఘంలో ఎలా మెలగాలో ముందు నేర్పిస్తారు.





తోటి పిల్లలతో ఎలా మాట్లాడాలో, ఎలా కలసి పనిచెయ్యాలో నేర్పిస్తారు. తరగత గదిలో భోజనాల ఏర్పాట్లు తామే చేసుకునేలా, భోజనం అయి పోగానే తరగతి గదిని అందరూ కలసి శుభ్రం చేసుకునేలా, చివరికి పాఠశాలలోని మరుగుదొడ్లను కూడా తామే శుభ్రం చేసుకునేలా శిక్షణ నిస్తారు. దీనంతటికీ కావలసినది తన అహంకారాన్ని తగ్గించుకుని, తోటి వారందరి మేలు కోసం పనిచెయ్యాలనే భావనే కదా?

స్వామి వివేకానంద నాగరకతను గురించి ఏమి చెప్పారో చూద్దాం- "స్వార్థం మూలంగా కలిగినదేదైనా సరే అది దిగజారుడుతనమే. ఓడ ఎక్కేటప్పడు, 'మామా! ఎవరేమైపోయినా ఫర్వాలేదు, నిన్ను నువ్వు కాపా డుకో!' అన్న ముతక సామెతలా ఉంటుంది సమాజంలో మనుషుల నీచమైన ప్రవర్తన. స్వార్థత్యాగం కొద్దిగా అలవరచుకుంటే చాలు, ఇవన్నీ తొలగిపోతాయి. తమ పిల్లలకు అలా చక్కటి సభ్యత, సంస్కారాలను నేర్పక పోవడం తల్లిదండ్రుల తప్ప నాగరకతకు స్వార్థత్యాగమే పునాది".

నాగరకతకు స్వార్థత్యాగమే పునాది అన్న భావాన్ని చూసినప్పడు, ఏ సమాజం అత్యున్నతమైన స్థాయిలో స్వార్థత్యాగాన్ని చూపుతుందో, అది అత్యున్నతమైన సమాజం అవుతుందని అర్థమవుతుంది. అది లేకుండా, సమాజం ఎంత సంపదను సృష్టించినా, ఎన్ని ఆయుధాలను సృష్టించినా అవేవీ దాని వినాశనాన్ని ఆపలేవు.

తల్లిదండ్రులు తమ అహంకారాన్ని విడిచిపెట్టి సహజీవనం చెయ్యాలి. తమ పిల్లలను సమాజసేవ చేసే ఉత్తమ పౌరులుగా తయారుచేయడం కోసం తమ స్వార్థాన్ని విడిచిపెట్టాలి. తల్లిదండ్రుల నిస్వార్థజీవనం మీదే కుటుంబం ఆధారపడి వుంది, సమాజం, దేశం కూడా దానిమీదే ఆధార పడి వున్నాయి. సమాజంలోని వ్యక్తులలో శీలబలం తగ్గిపోయి, స్వార్థంతో, కామంతో, క్షణికమైన కోరికల కోసం తెగబడితే, ఆ సమాజం త్వరలోనే కుప్పకూలిపోతుంది.

అందుకే స్వామి వివేకానంద ఇలా అంటారు - **"తల్లిదండ్రులు ఎప్పుడూ ముందుగా తమ గురించే ఆలోచించుకుంటూ ఉంటే, వారికి వారి పిల్లలతో ఉన్న సంబంధం, పక్షులకీ, వాటి పిల్లలకీ ఉన్న సంబంధంలాగా తయారవుతుంది. పక్షి పిల్లలు రెక్కలు రాగానే తమ తల్లి పక్షిని, తండ్రి పక్షిని గుర్తు పట్టడం మానేస్తాయి. ఏ పురుషుడైతే ప్రతి స్త్రీని భగవంతుడి మాతృత్వానికి ప్రతిరూపంగా చూస్తాడో అటువంటివాడు ధన్యుడు. ఏ స్త్రీ ప్రతి పురుషుడినీ భగవంతుడి పితృత్వానికి ప్రతి రూపంగా చూస్తుందో ఆ స్త్రీ ధన్యురాలు. ఏ పిల్లలు తమ తల్లిదండ్రులను ఈ భూమి మీద వెలసిన దేవతలుగా చూస్తారో ఆ పిల్లలు ధన్యులు".**

**అజ్ఞాని.... విజ్ఞాని ... :** మనిషి నిస్వార్థంగా ఎందుకు ఉండాలి? మనిషి తన తోటివారిని ఎందుకు దోచుకోకూడదు? మనిషి అబద్ధాలు ఎందుకు చెప్పకూడదు? ఎందుకంటే, తనలో ఏ ఆత్మ ఉందో అదే ఆత్మ అందరిలోనూ ఉంది, తనకు బాధ కలిగినట్టే అందరికీ బాధ కలుగుతుంది కాబట్టి! ఈ భావన సమాజంలోని వ్యక్తులలో బలపడాలి. అలా జరగడానికి, తమ నిత్యజీవితంలో, అనుక్షణం తమ చుట్టూ ఉన్న ప్రపంచంలో భగవంతుడే కంటికి కనిపించే రూపంలో ఉన్నాడన్న భావం మనుషులందరికీ చక్కగా అర్థం కావాలి. అనునిత్యం అందరూ ఈ భావంతో సమాజంలో ప్రవర్తించాలి. అందరూ ఆత్మస్వరూపులే అని భావించే వ్యక్తి దుర్మార్గంగా ప్రవర్తించలేడు కదా!

అందుకనే స్వామి వివేకానంద ఇలా చెప్పారు : "ఉన్నది ఒక్కటే! దానినే అజ్ఞానులు వస్తుప్రపంచంగా చూస్తారు, విజ్ఞులు భగవంతునిగా చూస్తారు. వస్తుప్రపంచంలో కూడా భగవంతుడే ఉన్నాడన్న విషయాన్ని సమాజం ఏ మేరకు అర్థం చేసుకుంటే ఆ మేరకు ఆ సమాజం పురోగమిస్తుంది. అజ్ఞాని రూపంలేని సత్యానికి రూపాన్ని ఇచ్చి, దాన్ని ఒక వ్యక్తి రూపంలేని సత్యానికి రూపాన్ని ఇచ్చి, దాన్ని ఒక వ్యక్తి రూపంలో చూస్తాడు, ఆరాధిస్తాడు.





కానీ, జ్ఞాని, ఒక రూపం ఉన్న వ్యక్తిలో కూడా కంటికి అగుపడని భగవంతుణ్ణి చూస్తాడు. సుఖదుఃఖాలలోనూ, శోకసంతోషాలలోనూ మనం నేర్చుకుంటున్న పాఠం ఇదే ..."

మనం చూస్తున్న విషయాలన్నింటిలోనూ భగవంతుడే ఉన్నాడన్నదే ఆ పాఠం. ఆ విధంగా చూసినప్పుడు, ఏ సమాజంలో మనుషులు 'సర్వం ఆత్మమయం' అన్న భావాన్ని ఒంటబట్టించుకుని, దానిని ఆచరణలో పెట్టి ప్రవర్తిస్తారో ఆ సమాజం, ఆ నాగరకత అత్యుత్తమమైనవవుతాయి.

# పారమార్థిక నిధులు

(భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్యాస శిష్యుల బోధలు)

'నేను కామాన్ని జయిస్తాను ... క్రోధాన్ని జయిస్తాను ... లోభాన్ని అధిగమిస్తాను....' అంటూ డంబాలు పలుకుతూ కూర్చుంటే నీవు ఎన్నటికీ వాటిని జయించలేవు. మనస్సును భగవంతుడిపై నిలిపితే చాలు కామక్రోధాలు వాటంతటవే సమసిపోతాయి.

'తూర్పు వైపుకు వెళ్ళేకొద్దీ పడమర దూరమవుతుంది' అనేవారు గురుదేవులు శ్రీరామకృష్ణులు. భగవంతుణ్ణి ప్రార్థించు, విషయవాసనలు ఎంత మాత్రం బాధించవు. అన్నిటికంటే భగవత్కృప ఎంతో ముఖ్యమని తెలుసుకో! భగవత్కృప లేనిదే ఏదీ సాధించలేం. ఆయన కృప కోసం నిరంతరం ప్రార్థించు. నీ ప్రార్థనలు ఎన్నటికీ వృథా కావు. భగవంతుడు కరుణామయుడు, తప్పక మన మొరనాలకిస్తాడు. కాకపోతే, కొంచెం సహనం వహించాలి.

- స్వామి బ్రహ్మానంద

పారమార్థిక సాధన అంటే నిష్కపటంగా ఉండటం, మనస్సును, వాక్కును ఏకం చేసి భగవంతుణ్ణి ప్రార్థించడం, కపటం లేకపోతే చాలు, మిగిలినదంతా ఆ భగవంతుడే మన ద్వారా చేయించుకుంటాడు. నీవు బలహీనుడవని ఎన్నడూ తలచవద్దు. నీవు బలహీనుడవే కావచ్చు, కానీ నీవు ఎవరిని శరణుపొందావో ఆయన సర్వశక్తిసంపన్నుడని మరచిపోకు. భగవంతుడు మనకు అండగా ఉన్నంతవరకూ బలహీనతకు తావు లేదు.

కర్మలు చేయడం ద్వారానే మనలోని బలహీనతలు ఏమిటో తెలుస్తాయి. మనం చేసిన పనుల యొక్క ఫలితాల మీద ఎంత ఆసక్తి ఉందో, మనలో ఎన్ని కోరికలున్నాయో, మనలో స్వార్థపరత్వం ఎంత వుందో.... ఇవన్నీ కర్మలు ఆచరించడం వల్లనే తెలుస్తాయి. మన హృదయంలో ఎప్పుడైతే భగవత్ప్రేమ ఉదయిస్తుందో అప్పుడు మనం చేసిన కర్మలన్నీ సాధనగా మారిపోతాయి. అదే నిజమైన భక్తి!

- స్వామి తురీయానంద

సాధన చేయకుండా కేవలం ఫిర్యాదులు చేయడం వల్ల ప్రయోజనం లేదు. జపధ్యానాలను క్రమం తప్పకుండా అభ్యసించాలి. అలా చేయడం వల్ల మనలోని కామ, క్రోధ, లోభాలు నియంత్రింపబడతాయ. ఏకాంత ప్రదేశంలో సాధన చేయాలి. అందరూ చూస్తుండగా చేయడం వల్ల మనలో అహంకారం పెరిగే ప్రమాదం ఉంది. అందుకే శ్రీరామకృష్ణులు 'జపధ్యానాలను మానసికంగాగానీ, ఏకాంత ప్రదేశంలోగానీ చేయడం మంచిది' అనేవారు.

నిరంతరం జపధ్యానాలు చేయడం సాధ్యం కాదు కాబట్టి అప్పడప్పడు సద్గ్రంథాలను పఠించాలి. అలా చేయడం వల్ల మనస్సులో చెడు తలంపులు తలెత్తవు. నియంత్రణలోలేని మనస్సు మన వినాశనానికి కారణమవుతుంది. మనస్సును నియంత్రణలో ఉంచడానికి భగవన్నామ జపం,సద్గ్రంథ పఠనం, సత్సంగం, ఆధ్యాత్మిక చర్చలు చేస్తూ ఉండాలి. అలా చేస్తూ ఉండటం వల్ల మనస్సు పరిశుద్ధమై భగవత్సాక్షాత్కారానికి దోహదపడుతుంది.

- స్వామి అద్భుతానంద





## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

ప్రదక్షిణలు పూర్తి అయిన తరువాత ధుని మాతకు నారికేళమును సమర్పించెడివారు. తరువాత గం.7.30 ని.ల వరకు చావడిలో ఆశీనులయ్యేవారు. భక్తులు వస్తే సత్సంగము చేసేవారు లేకపోతే ధ్యానము చేసుకొనెడివారు. గం.7.30ల నుండి గం.8.00ల వరకు గదిలో ఉండెడివారు. ఎనిమిది గంటలకు కరుణాకరన్ తెచ్చిన పాలు సేవించి సమాధి మందిరమునకు వెళ్ళి బకెట్టుతో బాబా అభిషేక తీర్థమును తెచ్చుకొనెడివారు. కోటయ్య అనే అతనితో విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ లేక హనుమాన్ చాలీసా పారాయణ చేయించెడివారు. సుమారు 10 గం.ల ప్రాంతంలో సుబ్రహ్మణ్యం (మణి)తో సత్సంగం చేసెడివారు. అటు పిమ్మట మరల ప్రదక్షణలు చేసి మధ్యాహ్న హారతి సమయమున ధుని మాతకు మరల నారికేళము, నవధాన్యములు మొ.నవి సమర్పించి చావడికి వెళ్ళి ధ్యానస్తులయ్యెడివారు. బాబాకు హారతి, నైవేద్య సమర్పణ పూర్తి అయిన తరువాత బాబా మహాప్రసాదమును తెచ్చుకొని అతి కొద్దిగా తాను భుజించి మిగిలినది భక్తులకు పంచెడివారు. హొటళ్ళ నుండి తనకు సమర్పించిన భోజన పదార్థములను కూడ భక్తులకు వితరణ చేసేవారు. అటుపిమ్మట సాయంత్రం గం.4.30 లేదా 5.00 గం.ల వరకు గదిలోనే ఉండి పారాయణ లేక ధ్యానము చేసుకొనెడివారు. ఈ సమయములో భక్తులనెవ్వరిని అనుమతించెడివారు కాదు. స్వామీజీ ఏనాడును పగటి పూట నిదురించెడి వారు కాదు. సాయంత్రం 5 గం.ల నుండి మరల ప్రదక్షిణలు చేసెడివారు. తరువాత గం.7.30 ని.ల వరకు గదిలోనే ఉండెడి వారు. తరువాత మహానైవేద్యమును తెచ్చుకొని కరుణాకరన్‌కు

మరియు ఇతర భక్తులకు పంచెడివారు. స్వామీజీ మాత్రం కరుణాకరన్ తెచ్చిన పాలు త్రాగెడివారు. రాత్రి గం.8.00ల నుండి గం.9.00ల వరకు చావడిలో భజన కార్యక్రమమును నిర్వహించి హారతి చేసెడివారు. అటు పిమ్మట ధునికి మరల నారికేళములను సమర్పించి గదికి వెళ్ళెడివారు. గం.9.15 ని.లకు పి.యస్.రావు, నాందేడ్కర్ (కాండ్రే)లు స్వామీజీ గదికి వచ్చెడివారు. గం.10.15 ని.ల వరకు నాందేడ్కర్ పారాయణ చేయుట గాని, స్వామీజీ వివరించిన సాయిభక్తుల అనుభవములనుగాని వ్రాసెడి వాడు. అటుపిమ్మట పి.యస్.రావు గం.11.30 ని.ల వరకు పారాయణ గావించెడివారు. ఒక్కొక్కసారి గం.12.30 ని.ల వరకు సత్సంగము చేయుట లేక ఆధ్యాత్మిక సంబంధమైన సందేహాలను స్వామి ద్వారా నివృత్తి గావించుకొనెడివారు. స్వామీజీ తరచుగా రావు గార్కి ఏకనాథ భాగవతం, భక్త కబీరు, తుకారామ్, తులసీదాస్ చరితములు తెలిపెడివారు. భగవద్గీత, రామాయణము, సాయి సచ్చరితము, గురు చరిత్ర పారాయణము చేయించెడివారు. ఇవేగాక రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, పుస్తకములను తెప్పించి పారాయణ చేయించేవారు.

దినములో మూడు లేక నాలుగు గంటలు మాత్రము నిద్రించి మిగి లిన సమయాన్నంతా సాయి సేవకే వినియోగించెడివారు మన పూజ్య స్వామీజీ.

స్వామీజీ షిరిడీ ప్రవేశమొనరించినది మొదలు దేహ త్యాగము చేసే వరకు ఏనాడును పాదరక్షలు ధరించలేదు. బాబా పరమ పావన పాద ధూళిచే పవిత్రమైనదీ షిరిడీ క్షేత్రం. ఇచట పాదరక్షలు ధరించి సంచ రించుట మహాపాపమని భావించెడివారు.

ఇంతటి కఠోర దీక్షతో సాయిని సేవించి తరించిన భక్తుడు మన స్వామీజీయే తప్ప వేరొకరు లేరని ఘంటాపథంగా చెప్పవచ్చును.

ఒకసారి స్వామీజీతో ఏకాంతముగా సత్సంగము చేయు భాగ్యమును






నాకు ప్రసాదించినారు. స్వామీజీతో నేను అనేకమంది సచ్ఛీలురైన సాయి భక్తులు ఇడుముల పాలవుచుండగా, దొంగభక్తులు, దొంగ స్వాములు, కపట గురువులు భోగభాగ్యాలలో తేలియాడుతున్నారు. ఈ వ్యత్యాసానికి కారణమేమిటని ప్రశ్నించగా స్వామి చిరునవ్వు నవ్వి “నీవు చెప్పినది నిజమే. దీనికి కారణం వారి పూర్వజన్మ సుకృతమేగాని మరియొకటి కాదు. పూర్వజన్మలో మనము చేసుకున్న పాప, పుణ్య ఫలాలను ఈ జన్మలో అనుభవించవలెను. పూర్వజన్మలో సత్కర్మలు చేసినవారు ఈ జన్మలో భోగభాగ్యములతో సుఖసంపత్తులు పొందగలరు. ఈ సుఖసంతోషాల మత్తులో ఈ జన్మలో చెడు కర్మలు చేసినచో వాటి ఫలితములను ఈ జన్మలోగాని లేక మరుజన్మలోగాని అనుభవించక తప్పదు. కొంతమంది అన్యార్జితముగా ధనమును సంపాదించి ఆ పాపములను ప్రక్షాళన గావించుకొనుటకు భగవంతునికి బంగారు ఆభరణములు సమర్పించుట, గుళ్ళు, గోపురములను నిర్మిస్తున్నారు. ఇటువంటి వాటివలన భగవంతుని కృప వీరికి లభించదు. కష్టార్జితములో అతి స్వల్పంగా సత్కార్యములకు ఖర్చు పెడితే భగవంతుడు సంతసించును. మన రాతలను బట్టే చేతలుం డునుగాని చేతలను బట్టి రాతలు కాదని మనము గ్రహించి సత్ప్రవర్తన కలిగియుండవలెను. చెడు విత్తనమును నాటి దానికి ఎన్ని ఎరువులు వేసినా ప్రయోజనము శూన్యమే గదా. అన్నిజన్మలలోను మానవజన్మ ఉత్కృష్టమైనది. దీనిని అందరు గ్రహించి ఇతరులకు కష్టనష్టములు కలిగించకుండ చేతనైనంత వరకు సాటి వారికి సాయమందించిన భగవంతుడు సంతసించి ఈ జన్మలోగాని లేక మరుజన్మలో గాని వారికి వారు చేసిన సత్కర్మల ఫలితములందించును”ని ఎంతో విపులంగా వివరించారు.

స్వామీజీ షిరిడీ చేరినప్పటి నుండి మహాసమాధి వరకు అంటే సుమారు నాలుగున్నర దశాబ్దాలలో ప్రతి క్షణాన్ని సాయిసేవకే అంకితము చేసిన ధన్యజీవి మన స్వామీజీ.

**(సశేషం)**



# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

(గత సంచిక తరువాయి)

సరే, నీకు చంపాలనిపిస్తే అలాగే చేయి. నా నుదుటిపై అలా వ్రాసుంటే నీవు మాత్రం ఏం చేస్తావు. కానీ, ఒక్క నిముషం ఆగు. నేను నా తలను రాముని పాదాలపై ఉంచుతాను. అప్పుడు కాల్చు" అని చెప్పి, మనసులో "బాబా రక్షించు, బాబా రక్షించు" అని మనసులో అత్యంత ఆర్తితో ప్రార్థిస్తూ తన శిరస్సుని రాముని చరణాలపై ఉంచాడు. దాదాపు తుపాకీని పేల్చబోయిన కాణ్హాభిల్ చివరి క్షణంలో వెనక్కు తగ్గి "సరే, నీ గురించి నేను మరలా విచారిస్తాను. అంతవరకు నీవు ఇక్కడ నుండి కదలకూడదు" అని హెచ్చ రించి వెళ్ళిపోయాడు.

దాదాపుగా ప్రాణం పోయే పరిస్థితి నుండి బయటపడిన దాసగణు అప్పటి మానసిక స్థితిని మనం సులభంగానే ఊహించవచ్చు. "బాబా దయ వలనే నాకు ప్రాణగండం తప్పింది" అనే వాస్తవం ప్రత్యక్షంగా అనుభవ మయ్యాక "అనన్యభావంతో శరణుచెందితే ఉపేక్షించనివాడే భగవంతుడు" అనే మహాత్ముల వచనోక్తి సారం తనకు పరిపూర్ణంగా అవగతం అయింది. ఆ సంఘటన వలన తనకు బాబా దివ్యచరణాల పట్ల భక్తి భావం ఎంతగా దృఢం అయిందంటే, తరువాత తాను చేసే కీర్తనలలో, ఏ మహాత్ముని గురించి తాను కీర్తన చేస్తున్నా, భగవంతుని అవతారమూర్తుల లక్షణాలను వర్ణిస్తూ, అందుకు ఉదాహరణగా బాబా గుణగుణాలనే వర్ణించేవాడు. జన్మజన్మల నుండి కంటికి రెప్పలా కాపాడుతూ, చేయి పట్టుకొని నడిపిస్తున్న ఆ సద్గురు దేవుని దివ్య వచనాల మరియు చరణాల ముందు అన్యమంతా అల్పం అనే భావం దృఢపడటానికి, సద్గురు సంకల్పానుసారం కాణ్హాభిల్ ప్రకరణం ఇథోథికంగా కారణభూతమైంది. సరి!

దాసగణుని కాణ్హాభిల్ అయితే సందేహించాడు కానీ, గంగారాం





పాటిల్‌కు మాత్రం దాసగణు పట్లనున్న పూజ్యభావంలో ఏ మార్పూ లేదు. ఇంకా చెప్పాలంటే, చావు కూడా దేవుని చరణాల వద్ద నున్నప్పడే రావాలని కోరుకున్న దాసగణు గొప్పతనాన్ని చూసి ఆ పూజ్యభావం ఇంకా పెరిగింది. ఆ విషయాన్నే కాణ్హాభిల్లుకి కూడా చెప్పి తాను కొంచెం మెత్తబడేటట్లు చేసాడు.

ఒకసారి గంగారాం పాటిల్ చెరకు తోటలో పంటను కోసి, బెల్లం తయారుచేసే ప్రక్రియను ప్రారంభించే సందర్భంగా విందు ఏర్పాటు చేసాడు. ఆ విందుకు ఆహ్వానించడానికై పాటిల్ దాసగణు వద్దకు వచ్చాడు. "మహారాజ్ మీరు తప్పక ఆ విందుకు రావాలి. కాణ్హాభిల్ కూడా వస్తు న్నాడు" అని ఆహ్వానించాడు. "పాటిల్, కాణ్హాభిల్ కూడా వస్తున్నాడంటే అక్కడ మాంసాహారం వంటివి తయారుచేస్తారు. అటువంటి చోటికి నా వంటి రామదాసి రావడం యోగ్యం కాదు. నీవు వస్తూ నాకోసం ఒక చెరకు ముక్కను తెచ్చావంటే చాలు" అని చెప్పి దాసగణు ఆ ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించాడు.

తరువాత దాసగణు తన ఉద్యోగ ధర్మాన్ని అనుసరించి "కాణ్హాభిల్లు ఫలానారోజు, ఫలానా సమయానికి, ఫలానా చోటుకి వస్తున్నాడు" అని పై అధికారులకు సమాచారాన్ని అందించాడు. దాంతో, కాణ్హాభిల్లు విందుకు హాజరైన సమయంలో దాదాపు యాభైమంది పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. హోరాహోరీగా కాల్పులు జరిగాయి. చాలా మంది పోలీసులు మృత్యువాతపడ్డారు. చివరకు కాణ్హాభిల్లు చాలా ఒడుపుగా తప్పించుకున్నాడు. ఇక్కడ ఇలా కాల్పులు జరుగుతున్న సమయంలో ఏదో విధంగా అక్కడ నుండి బయటపడ్డ గంగారాం పాటిల్, దాసగణు వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి "మహారాజ్, కాణ్హాను పోలీసులు చుట్టుముట్టారు. తనకు ఏ ఆపద రాకుండా రాముడిని ప్రార్థించండి" అని వేడుకున్నాడు. అప్పడు దాసగణు తన పూజలో నిమగ్నమైయున్నాడు. తరువాత కాణ్హాభిల్లు తప్పించుకొన్నాడనే వార్త తెలియగానే, అలా జరగడం

దాసగణు చేసిన ప్రార్థన వలనే అని పాటిల్‌కు బలమైన నమ్మకం ఏర్పడింది. పాటిల్ ఆ విషయాన్నే కాణ్హాభిల్లుకి కూడా చెప్పి తనకు కూడా దాసగణు పట్ల భక్తి భావం ఏర్పడేటట్లు చేసి, తనను కూడా దాసగణు దర్శనానికి తీసుకువచ్చాడు. అప్పటి నుండి కాణ్హాభిల్లు కూడా దాసగణు పట్ల భక్తి భావంతో మెలగసాగాడు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రభుత్వం, కాణ్హాభిల్లుని ఎదుర్కొని పట్టుకోవడం కష్టం అని నిర్ధారించుకొని "కాణ్హాభిల్లు నీ దగ్గరకు వచ్చినప్పుడు అవకాశం చూసుకొని సంహరించ" మని దాసగణుని ఆదేశించి, అందుకు అవసరమైన తుపాకీని మరియు మందుగుండు సామాగ్రిని పంపించింది.

గూఢాచారిగా వ్యవహరించిన రోజులలో చేసిన పారమార్థిక సాధనల ఫలితంగా తనలో నెలకొన్న మానసిక స్థితి మరియు సాత్విక భావాల వలన, ఉద్యోగ ధర్మంలో భాగమే అయినా, తాను ఒక మనిషిని చంప లేననే భావంతో అనారోగ్యాన్ని కారణంగా చూపి లోణి గ్రామం నుండి వెళ్ళిపోయాడు. తరువాత నానాసాహెబ్ చందోర్కర్ సహాయంతో, అహ్మద్ నగర్‌లోని ఒక వైద్యుని వద్ద నుండి "గుండె చాలా బలహీనంగా ఉందని, ఎటువంటి ఉద్వేగపూరితమైన పరిస్థితులను తట్టుకోలేదు" అనే ధృవీకరణ పత్రాన్ని తీసుకొని, ప్రభుత్వానికి సమర్పించి శాశ్వతంగా ఆ బాధ్యత నుండి నివృత్తి చెందాడు.

నిత్యనియమంగా ప్రతిదినం చేసుకున్న పూజావిధి, విష్ణు సహస్ర పఠనం, జ్ఞానేశ్వరి, దాసబోధ వంటి ఉచ్చశ్రేణి ఆధ్యాత్మిక గ్రంథాల పారా యణం వంటి సాధనల వలన మరియు పోలీసు సిపాయిగా ప్రాణాలు పోయేంత పణంగా పెట్టి అత్యంత కఠిన పరిస్థితులను చవిచూడడం వలన దాసగణుకి మొట్టమొదటిసారిగా ఆ ఉద్యోగాన్ని వదిలివేయాలనే భావనే బలంగా కలిగింది. కానీ, ఫౌజ్‌దార్ పదవి మీదనున్న అభిమానం ఆ సమయంలో పైచేయి సాధించడం వలన మిన్నకుండిపోయాడు.

**(సశేషం)**





**శ్రీ కృష్ణావతారం**

# శాశ్వత ధర్మగోప్త



**- రచన : భండారు సదాశివరావుగారు**

**(గత సంచిక తరువాయి)**

## 7. ప్రాగ్జోతిషయం

కృష్ణుడు గోమంతక ప్రభువు వైనతేయునికి సందేశం పంపాడు. ఒక వందమంది ఆరితేరిన జోదులు బయలుదేరి త్రివిష్టపానికి వెళ్ళి, అక్కడి నుండి హఠాత్తుగా త్రయోదశి రాత్రికే ప్రాగ్జోతిషానికి చేరి ఉదయమే సాధువుల వేషాలతో దుర్గద్వారం దగ్గర బల్లకట్టుకు చేరాలి. అంతవరకు మణిపుర రాజ్యంలో చిత్రవాహనుని అతిథులుగా ఉండాలి. వారందరూ పరశురామకుండాన్ని, కామాఖ్యదేవిని సందర్శించడానికి వచ్చిన తైర్థికులుగా వ్యవహరించాలి. తదుపరి సాత్యకిద్వారా చేయవలసిన పనుల వివరాలు వారికి అందుతాయి. వెంట ఆయుధాలు ధరించరాదు. అలాగే ద్వారకకు ఇరవైమంది గరుడ సైనికులను-కాకలు తీరిన వారిని-గాలిలో ఎగిరిపోగలంత వేగం గల వారిని తీసుకొని స్వయంగా వైనతేయుడు రావాలి. ప్రాగ్జోతిషం నుండి వచ్చిన ఒక ప్రౌఢ శ్రోత్రియుడు కృష్ణుని సందేశాన్ని తీసుకొని వెళ్ళాడు. అతనివెంట వైనతేయునికి పరిచయమున్న ఒక గూఢచారిని కూడా పంపాడు.

మణిపురం పరిసరాలలో నాగ నివేశనాలున్నాయి. కృష్ణుడు నాగకూటా నికి ఉద్ధవుణ్ణి పంపాడు. అతడు మణిమానుణ్ణి తీసుకొని ఒక వందమంది నాగయోధులను తీసుకొని లోహిత నది వైపున నున్న నాగ నివేశనాలలో ప్రవేశించి సిద్ధంగా ఉండాలి. వీలైతే స్థానికులలో నాగులు లభిస్తే వారి ద్వారా నరకుని నిర్బంధములో ఉన్న స్త్రీలతో సంపర్కం స్థాపించుకోవాలి.

ప్రాగ్జోతిషం మీదికి హఠాత్తుగా దాడి జరగాలి. ఎప్పుడు, ఎలా అనే

వివరాలు తరువాత అందుతాయి. ప్రాగ్జోతిష దుర్గంలోని రెండు బల్లకట్టల దాకా మెరుపుదాడికి సిద్ధమై ఉండాలి.

కృష్ణుడు తన ప్రయాణాన్ని కూడా నిర్ణయించాడు. ద్వారక నుండి బయలుదేరి దారిలో మొదటి మజలీ దశార్ణవం. దశార్ణవ నృపాలుడు హిరణ్యవర్మకు కృష్ణుడంటే సాక్షాత్తు దేవుడే. అక్కడ రథాలకు పూన్చే అశ్వా లకు, ఆశ్వికులకు కూడా విశ్రాంతి ఇచ్చి, రెండవ మజిలీ కాంపిల్యంలో ద్రుపదుల వారి సన్నిధిలో గడపాలి. ఆ దేశపు రాజధాని శక్తిపురిలో దృష్టకేతువు ఆతిథ్యాన్ని స్వీకరించి, విదేహలో రెండు రోజులు గడిపి, అక్కడ నుండి మణిపురం చేరుకోవాలి.

ఈ ప్రయాణం అంతా మణిపుర మహారాజు చిత్రవాహనుని ఆహ్వా నంపై, పరశురామకుండ సందర్శనానికి బయలుదేరినట్లుండాలి. యుద్ధ ప్రయత్నాలు కన్పించరాదు. శస్త్రములన్నీ చిత్రవాహనుని రాజ్యంలోనే లభిస్తాయి.

గర్గాచార్యులవారు ఆశ్వయుజ శుద్ధమి దశమినాడే ముహూర్తాన్ని నిశ్చయించాడు. బహుళ దశమికి మణిపురం చేరేటట్లు దారిలో ఏర్పాట్లు చేసి, చేసినట్లు చారుల ద్వారా ద్వారకకు కబురంపుతూ, సాత్యకి మణి పురానికి ముందే చేరి ఉద్ధవ, మణిమానులతో సమన్వయం నెరపుకోవాలి.

మిగతా శ్రోత్రియులతో అక్రూరుల వారు వెళ్తారు. వారు శ్రోత్రియుల ఇండ్లలో, నరకుని బంధనాలలో ఉన్న స్త్రీలకు భక్తికి గల శక్తిని ప్రబోధించాలి. వారు ధైర్యం చెడరాదు.

అనుకున్న ప్రకారమే ఏర్పాట్లు జరిగాయి. వైనతేయునికి కబురు చేరినట్లు వార్తలందాయి. ఉద్ధవుడు ప్రయాణమై, నాగకూటానికి చేరినట్లు చార వార్తలు వచ్చాయి. అక్రూరుడు భాగవత సంప్రదాయ ఉద్గాతగా శ్రోత్రియులతో తీర్థాలు సేవిస్తూ బయలుదేరాడు. శ్రావణమాసం గడిచింది. ఇక శ్రీకృష్ణుడు తన వ్యూహాన్ని నిర్ణయించుకోవాలి.

శ్రీకృష్ణుడు అక్కడినుండి చేదీ, విదేహ రాజ్యాల మీదుగా మణిపురానికి





ఏకాదశి నాటికి చేరాడు.

చిత్రవాహనునికి శ్రీకృష్ణుని రాకను గురించి ముందే రహస్యవార్త చేరింది. ఉద్ధవుడు, అక్రూరుడు ఆయనను కలుసుకొని శ్రీకృష్ణుని వ్యూహాన్ని తెలిపారు. చిత్రవాహనునికి అన్నీ భయసందేహాలే. ఉద్ధవ, అక్రూరులు అతనితో చర్చించిన తరువాత కొంత మనస్సు కుదుటపడింది.

ఈలోగా శ్రోత్రియులు ప్రాగ్జోతిషం చేరుకున్నారు. అక్రూరుడు కూడా శ్రోత్రియ వేషంలో నగరంలోకి ప్రవేశించాడు. శ్రోత్రియులు, నరకుని చెరలో మ్రగ్గుతున్న తమ స్త్రీలను చూడడానికి వెళ్తూ అక్రూరుణ్ణి కూడా తీసుకొని వెళ్ళారు. అక్కడ అక్రూరుడు ఏకవేణులై, బక్క చిక్కిన యువతు లను, ప్రౌఢలను చూచాడు. శ్రీకృష్ణుని లీలను వర్ణించి చెప్పాడు. 'క్రూరుడైన కంసుణ్ణి, సంహరించిన వాడాయన. జరాసంధుణ్ణి పరాభవించి గోమంతకంలో క్షమించి విడిచిపెట్టాడు. కుండినపురంలో జరాసంధ, శిశుపాల, సాళ్వాదులను పరాభవించి సాక్షాత్తు ఆదిలక్ష్మి రుక్మిణీదేవిని తీసుకొని వెళ్లి పెండ్లి చేసుకున్నవాడు. పసితనంలోనే ఎందరో రాక్షసులను క్రూరకర్మలను వధించిన కారణజన్ముడు. పూతన రాక్షసి చనుబాలతోపాటు రక్తాన్ని పీల్చి సంహరించిన లీలామానుష జన్ముడు. సాక్షాత్తు వాసుదేవుడే. ఆయనే మీ ప్రార్థనలను విని ఏ క్షణానైనా స్వయంగా రావచ్చు. ఆయన మీకు అభయమిచ్చాడమ్మా'.

బైటి ప్రపంచంతో సంబంధంపోయి, నిరలంకృతలై, కావిరంగు గుడ్డ లను కట్టుకొని పరమేశ్వరుని మీద భారం ఉంచి బ్రతుకుతూన్న అబలలు. వారికి అక్రూరుల వారి మాటలు ధైర్యాన్ని కలిగించాయి. వారిలో ఒక ఆశ అంకురించింది. సాక్షాత్తు పరమేశ్వరుడు యదువంశ భూషణుడు, సాధు సంరక్షణకు దేవకీ వసుదేవుల గర్భాన పుట్టిన ఆ పరమ కళ్యాణ మూర్తి, ఆ ప్రభువే తమను రక్షించడానికి ప్రతినబూనాడట! ఇహ ఆయనే తమకు త్రాత, ప్రభువు, భర్త్, ధర్త, దీనబాంధవుడు.

**(సశేషం)**

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**



## 7. పిలచిన పలికే దేముడు



ఆ.వె. మందు మాకు లిడుచు మాన్పును రోగాలు
కళ్ళు పోవు మందు కనులు బాగు
సాయి చేతి చలువ సాధ్యమా పొగడంగ
పుణ్యలోక మొసఁగె పులికి గూడ ... 1

ఆ.వె. వేద వాక్య మిదియ వీనుల వినుమయ్య
పుణ్య కార్యమెద్ది పుడమి నందు
ధర్మ కార్యమదియ ధర్మార్థ కామ మో
క్షములు బడయగాను సంతు గనుట ... 2

కం. గృహమును దిద్దెడు భార్యయు
గృహమును నడపెడు మగండు ఋషితత్త్వముతోన్.
యిహమును పరమును బొందును
ఇహమందున కొమరులకును ఇంగిత మొసఁగన్ 3

కం. సంతానము కనినంతనె
సంతసమును పొందలేవు సంపూర్ణముగాన్
సంతృప్తి నాడు కలుగును
సంతానము లోకమునకు సంతసమొసఁగన్ 4





కం. కొమరులు లోకహితులవగ
తమ కార్యము పూర్తి యగుట తక్షణముననే
తమ దారిన వనములకును
గమనము చేయంగ మేలు కానగ మోక్షం. 5

తే.గీ. నింబ వృక్షపు నీడన నిలిసి సాయి
ఒక్క సంవత్సరంబును ఊరి సేవ
జేసి, పిదప నెటకొనేగి, జేరె మూడు
వత్సరములకు శిరిడీకి వచ్చి మరల 6

ఆ.వె. ధూపు గ్రామమందు ధూళిలో పుట్టించె
నిప్పు నీరు నొకచొ నేర్పుమీర
చాందు పాటిలు గని శక్తికబ్బురపడి
గుఱ్ఱము కొనతేవ నరిగె వేగ. 7

తే.గీ. చాందు పాటిలు కొనిరాగ జ్ఞానమూర్తి
వచ్చి చేరెను శిరిడీని వదలినాక.
మూడు సంవత్సరములును మురిపెముగను
తపము జేసె నెచటొ సాయి తనవి దీర. 8

తే.గీ. ఫలత మొచ్చును, నమ్మిన బాధ దీరు,
కోర్కె దీరగా నేమియు కొదువ గాదు,
పిలచిన పలికే దేవుడు, భీతి వలదు
సకల జగముల రక్షించు, సాయియుండ 9

కం. శాంతముగా యోచించుము
భ్రాంతిని బొందక నిరతము బాబాగొలువన్
క్రాంతిని దెచ్చును బ్రతుకున
కాంతిని గల్గించి నిన్ను కడకున్ జేర్చున్ 10

**(సశేషం)**

# DECLARATION

Statement about ownership and other particulars about **"Sachidananda Sadguru Sai Vani"**.

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | Hyderabad |
| 2. | Periodicity of publication: | | Monthly |
| 3. | Printer's Name | : | V.V. Krishna Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | Sai Sri Printers, 8-3-945, Shop No. 21, Pancom Business Centre, Ameerpet, Hyderabad - 500 016 (A.P.) |
| 4. | Publisher's Name | : | Sri Ramananda Prabhuji |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Yadadri Bhuvanagiri Dist, Pin - 508 126 |
| 5. | Editor's Name | : | Sri Ramananda Prabhuji |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Yadadri Bhuvanagiri Dist, Pin- 508 126 |
| 6. | Owner's Name | : | Sachidananda Sadguru Sai Vani Publications, Saidhamam, Yadadri Bhuvanagiri Dist- 508 126 |

I, Sri Ramananda Prabhuji declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 01-03-2022

Sd/-

Sri Ramananda Prabhuji





# సంకల్పమే శక్తి ....

– వి.యస్.ఆర్.మూర్తి (ఉపనిషత్ సుధ నుండి)

నచికేతా! నీవంటి జిజ్ఞాసి అరుదుగా ఉంటాడు. కనుక విను!

"సత్యాన్వేషణలో ఉన్న సాధకుడు తన సంకల్పానికి సత్యభావనను, సత్యనిష్ఠను కలపాలి. అది నిస్వార్థంగా ఉండాలి. ఇదొక తిరుగులేని జయకేతన స్థాయి. సత్యం, జ్ఞానసమృద్ధం కనుక బుద్ధి నుండీ ఏర్పడే సంకల్పం బలాన్ని సంతరించుకుని, బుద్ధి జ్ఞానమయమౌతుంది. ఆపై వ్యర్థవాదాలకు తావులేని బుద్ధి కుశలత, మనసును లక్ష్యంవైపు నడిపిస్తుంది. నిజానికి కర్మలన్నీ అటువంటి వికాసబుద్ధిని అనుసరిస్తాయి. చేసే పనులన్నీ వివేకవంతము, విచక్షణాంచితమూ అయి వ్యక్తిని, సమాజాన్ని సక్రమంగా, సన్మార్గంలో నడిపిస్తాయి. సర్వమత సమ్మతమైన, సమాజ హితమైన ధర్మమే జాతికి రక్ష, జీవితమే ఆధ్యాత్మ వేదిక. ప్రతి క్షణాన్ని ఆధ్యాత్మమయం చేయాలి. మత సమన్వయం జాతి మనుగడకు శ్రీరామరక్ష! సంఘర్షణ, స్పర్థ, అహంకారం, డాంబికం, స్వార్థం వంటి వ్యతిరిక్త భావనలు ఎవరికీ అక్కరకు రావు. మనసుని నిగ్రహించుకుంటూనే బుద్ధిని హేతుభావనతో నడిపించాలి. కంటికి కనిపిస్తున్న ప్రతి వస్తువునూ బుద్ధికుశలతతో చూడటం ప్రారంభించాలి. చివరకు, ఆ వస్తువు యొక్క మూలాలను దర్శించగలగాలి. దీనికై సంకల్పశక్తి కావాలి. అంతా ఒకటే, నిజానికి ఉన్నదంతా ఒకటే!

ఏకం అనేకంగా కనిపిస్తున్న వస్తు ప్రపంచమూలాన్ని పట్టుకోగలిగితే భేదభావం నశిస్తుంది. దేనిపట్లా తీవ్ర అపేక్ష, కారణం లేని ఉపేక్ష వంటి మనోస్థితులు ఉండవో, అదే శుద్ధ బుద్ధి!

శుద్ధ బుద్ధి, సంకల్ప శక్తి, నిరంతర సత్యాన్వేషణ, విశేష జ్ఞానం కలబోసు

కున్న స్థితి నుండీ పుట్టిందే ప్రేమ. ఇది రాగ, అనురాగాలను మించిన దివ్య భావన!

రాగబంధాలన్నీ రక్తగత బంధనలే! తనను కన్నవారు, తాను కన్నవారు, తోబుట్టువులు, రాగబంధానికి పరిమితమైనవారే! దుఃఖాలు, సుఖాలు, సంతోషాలు, ఆనందాల అనుభవాలు, సంయోగ వియోగాలు, మోద, ప్రమోద, విషాదాలు ఇవన్నీ కాలిమడమలకు తగిలించుకున్న సంకెళ్లు. సంకెలలు తెగటం, తెంపుకోవటం అంటూ ఉండదు. స్థితిగతులు మారినపుడల్లా రాగబంధాలు బలపడటమో, బలహీనం కావటమో జరుగుతాయి. కానీ, ఏటిలో కెరటాల వలె, నీటిలోనే అవి మసలుతుంటాయి.

రాగబంధం తర్వాతది అనురాగబంధం. ఇది నిత్యం మారుతూ ఉంటుంది. దీనికి నిబద్ధత లేదు, నిలకడ లేదు.

ఈ రెంటినీ దాటినదే ప్రేమబంధం. ఇది ఏర్పడటం అంత సులభం కాదు. సంకుచితము, స్వార్థము ఎరగని శుద్ధ మనసు మాత్రమే దీనిని అనుభవించగలదు. ఇది తర్కబుద్ధికి లోబడదు. తత్త్వబుద్ధికి తప్పక సిద్ధిస్తుంది.

సత్యనిష్ఠను, సద్వస్తువును కాంక్షించగల నిశ్చలబుద్ధి సత్యాన్వేషణను సులభతరం చేస్తుంది. ఆ ప్రయత్నంలోనే మనసు, బుద్ధి, చిత్తం ప్రేమగా రూపుదాల్చి, సాధకుణ్ణి ప్రేమమూర్తిని చేస్తాయి.

ఈ స్థితిలో మనిషి యోగంలో ఉన్నా, సంయోగంలో ఉన్నా, వియోగంలో ఉన్నా, భోగంతో సంగుడై ఉన్నా, నిశ్చలానందాన్ని బయటా లోపలా అనుభవిస్తాడు. లౌకికం, పారలౌకికమంటూ రెండూ లేని అమృతసిద్ధిని అనుభవమయం చేసుకుంటాడు. నిరంతరం అంతరంగ యాత్రను సాగిస్తాడు.

అనిత్య, అశాశ్వత క్షణిక స్థితులను దాటి, నిత్య సత్య శాశ్వత ఆత్మైకస్థితిని అనుభూతిగా మిగుల్చుకుంటాడు.





అంధకారం, అస్పష్టత, అనాచారం, అవిద్య వంటి తామస భావన నుండీ వెలుగువైపు వడివడిగా అడుగులు వేస్తాడు.

మృత్యుభావనను జయించి, అమృతస్థితిని స్థిరం చేసుకుంటాడు. ఈ ప్రయత్నమంతా సాక్షాత్కారంలో భాగమే!

ప్రేమస్వరూపంగా నిలకడ చెందినవాడు, తనలోని దివ్యత్వాన్ని నిర్మల మనసు ద్వారా, నిశ్చలబుద్ధి ద్వారా, ప్రశాంతచిత్తం ద్వారా వెలుగులీనుతూనే ఉంటాడు. అదే సిసలైన సాక్షాత్కార స్థితి.

సంకల్పశక్తులు అనుగ్రహించే దివ్యానుభూతి ఇదే! ..." యముడి ఆత్మ విచారధారను అందుకుంటున్న నచికేతసుడు, ఆనందమయుడై, ప్రేమాంచిత రూపంగా తనను తాను తీర్చిదిద్దుకుంటున్నాడు.

ఆధ్యాత్మిక రాజమార్గం వైపు ఇంకా ఎదురుచూస్తున్నాడు, మరింత వినయంగా.

# ఆత్మ దర్శనం

**– వి.యస్.ఆర్.మూర్తి (ఉపనిషత్ సుధ నుండి)**

బయటి ప్రపంచం అనుభవాన్నిస్తే నిజానికి అంతరప్రపంచం అనుభూతినందిస్తుంది. అనుభవం అనుభూతిగా మారాలంటే అంతరంగ ప్రయాణం చేయాలి. ఆ ప్రయాణం ప్రాపంచికానుభవాలకంటే ఉదాత్త అనుభవాలను కలిగించి, దృష్టిని లోపలకు మరల్చి, లోచూపును ప్రసాదిస్తుంది. దీనినే అంతర్నేత్రమని, మూడో కన్నని యోగశాస్త్రం వర్ణిస్తుంది. ఇంద్రియాలను అధిగమించి ప్రయాణించగల మనస్సు ఈ స్థితిని సునాయాసంగా అందుకుంటుంది.

అప్పటి వరకు తెలిసిన ప్రాపంచిక విలువలు తమను తాము ఆవిష్కరించుకుంటూ మనసును అంటే మన ఆలోచనలను అంతర్ముఖం

చేస్తాయి. అవి భౌతిక, ఆదిభౌతిక స్థితులను దాటిన ఆధ్యాత్మ విలువలు.

ఈ విలువల ఆచరణ నిజానికి ఎదురీతే. ఏటవాలు ప్రయాణం మాత్రం కాదు. అయినా ఆధ్యాత్మిక విలువలందించే తృప్తి, సమర్పణ, వినయం, విచక్షణ, విశ్లేషణ వంటి నిర్ణయాత్మక భావనలు ఎదురీతకు మనిషిని సిద్ధం చేస్తాయి. ఈ సందర్భంలో ఎదురీత కష్టాన్ని కలిగించకపోగా నిర్భయత్వాన్ని, ధైర్యాన్ని ప్రసాదిస్తుంది. సముద్రంలో ఎగసిపడుతున్న కెరటాలను చూస్తున్నట్లుగా సాక్షీభూత స్థితి అలవడుతుంది. ఇది నిరాశకు, నిర్వేదానికి తావులేని అద్భుత స్థితి.

ఇక్కడే చింతన ప్రారంభమవుతుంది. స్థూలశరీర పరిస్థితిని దాటి మనసు సూక్ష్మశరీరాన్ని గూర్చిన ఆలోచన చేయటం మొదలుపెడుతుంది.

మన ఆలోచనలు, మన జ్ఞాపకాలు, అహంకారం, మమకారం, వాసనలు, మూల వాసనలు ... కలిసి సూక్ష్మ శరీరం ఏర్పడుతుంది. దీని ఆధారంగా పునర్జన్మ సిద్ధాంతం రూపుదిద్దుకొని, కాలపరీక్షకు నిలబడి ఎందరెందరినో అధ్యయనం చేసిన తరువాత పునర్జన్మ ఉన్నదన్న భావన స్థిరపడుతుంది. కాలగమనంలో అది సిద్ధాంతమై బహుళ జనామోదాన్ని పొంది నిలబడుతుంది.

కనుక దేహం పోయినా ఆత్మ ఉంటుంది. ఆత్మ మళ్ళీ మరొక శరీరాన్ని పొంది స్థూలం నుండి సూక్ష్మం వైపు; సూక్ష్మం నుండి అంతర్ముఖత్వం వైపు, ఆపై అనంత ఆద్యంతరహిత స్థితిని పొందే దశకు చేరుకుంటుంది. ఇదొక నిరంతర ప్రక్రియ.

ఈ విషయమంతా వాదానికి, తర్కానికి లోబడేది కాదు. సత్యాన్వేషణకు ఇది చుక్కాని. ఈ అనుభవం లేకుండా సత్యసాక్షాత్కారం కలగదు. కలిగినా అవునో కాదో అన్న సంశయం మాత్రం మిగిలిపోతుంది.

సాక్షాత్కారం పొందాలన్న నిశ్చయబుద్ధి కలవాడికి ఇది దోహదకారియై





సందేహ సిందోహాలను తరిమికొట్టి, సాక్షాత్కార అనుభూతిని వరదానం చేస్తుంది.

“నచికేతా! గురువు-శిష్యుడు, ఉపాధ్యాయుడు-విద్యార్థి, ఆచార్యుడు-అంతేవాసి వంటివారు కలిసి జీవిస్తే తమ సర్వశక్తులను జ్ఞానం పొందటం లోనే వినియోగిస్తారు.

ఈ ప్రయత్నం అగాధ జలధిలో, ఆలుచిప్పలలో దాగిన ముత్యాలను పట్టుకోవటం వంటిది.

లోక గురువులు విషయాన్ని తెలియజేస్తే, సమర్థ గురువులు విషయాన్ని విపులంగా వివరిస్తే, మోచక గురువులు మోక్షమార్గాన్ని సూచిస్తే, సద్గురువులు సత్యం వైపు నడిపిస్తారు. వీరందరూ తమ తమ బోధను, ప్రయత్నాన్ని కొనసాగిస్తూ సాధకుణ్ణి ఆతడి అంతరంగం వైపు నడిపించాలి.

సామాన్య, సాధారణ గురువులకు ఇది తలకు మించిన పని!

కనుక సమర్థ సద్గురువుకై తపించాలి. అహంకారము ఉంటే గురువు దొరకడు. గురువు దొరికితే అహంకారముండదు. ఉండకూడదు. మూఢ విశ్వాసాలను దాటి సక్రమ యదార్థ సాధన చేయాలి. తర్కం, వివాదం విడనాడాలి. గురుబోధను, శాస్త్రాన్ని ప్రమాణం చేసుకుని సాధన చేయాలి. మనస్సును పూర్తిగా తెరచి ఉంచాలి. బుద్ధిని వికాసమానం చేయాలి. చిత్తవృత్తులను నిరోధించాలి. అహంకారాన్ని వదులుకోవాలి. అహం స్ఫురణను వెలిగించుకోవాలి. అది ఆత్మ దర్శనానికి దారితీస్తుంది. అంతటితో అన్వేషణ ముగుస్తుంది. అనుభూతి అంతరంగాన్ని ప్రకాశమానం చేస్తుంది. అదే స్వస్వరూపానుసంధానం. తేలిక మాటల్లో ఆత్మ దర్శనం” అన్నాడు యమధర్మరాజు.

నచికేతసుడు నమస్కరించాడు, భక్తితో, కృతజ్ఞతతో!